క్లుప్తంగా

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని పాముపురం, నాటవెల్లి గ్రామాల్లోని యువకులకు బీజేపీ మండల నాయకులు వాకిటి రాజమౌళి క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, క్రీడాకారులు క్రీడల్లో మంచిగా రాణించాలన్నారు. వేసవి సెలవుల్లో యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు సొంత ఖర్చులతో క్రికెట్ కిట్లను అందజేస్తున్నట్లు రాజమౌళి తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన వట్టిపల్లి భూపాల్‌రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు, మాజీ మార్కెట్ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి గురువారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృపాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజు, గురువారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగరాజు, సురేష్ నాయకులు పాల్గొన్నారు.

మలుపుతో ప్రమాదం



మదనాపురం: మండలంలోని కొన్నూరు సమీపంలో ప్రధాన రోడ్డుపై ప్రమాదకర మలుపుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపును సూచించే బోర్డు కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో పరిసర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొత్తగా ఆ రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనాలపై మలుపు గుర్తించక అదుపు తప్పి కిందపడడంతో గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద స్పీడు బ్రేకర్లతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లపైనే విద్యుత్ తీగలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్ ఎస్సీ కాలనీలో ఇళ్లపైనే 11 కేవీ విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. రాత్రివేళలో ఈదురు గాలులు వీచినప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు అరచేతితో పెట్టుకొని ఇళ్లపైకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లలు ప్రమాదాలబారిన పడకముందే విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం



వనపర్తి: ప్రస్తుతం అమల్లో ఉన్న కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సురేష్ డిమాండ్ చేశారు. గురువారం 138వ మే డే ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రి ఆవరణలలో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్మిక ఉద్యమంలో వీరమరణం పొందిన వారికి కార్మికులు నివాళులర్పించారు. కార్మిక హక్కుల సాధన కోసం ఎలాంటి పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని నాయకులు రాంరెడ్డి, శ్రీనివాస్ చెప్పారు. ఎనిమిది గంటల పనిదినాల అమలు కోసం ఎందరో కార్మికులు త్యాగాలు చేసి సాధిస్తే.. నేటి కేంద్ర ప్రభుత్వం పన్నెండు గంటల పనిదినాలను అమలు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, ఆస్పత్రి మెడికల్ కళాశాల బ్రాంచ్ నేతలు శ్రీను, నరసింహ, వరుణ్, మహేష్, మోహన్, శ్యాం, కుమార్, రాజేష్, శ్రీకాంత్, కుమార్, కృష్ణ, శేఖర్, కళావతమ్మ, కవిత, లక్ష్మి, పార్వతమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కళాశాల కోసం వినతి

రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కాలేజీ సాధన సమితి సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వేర్వేరుగా వినతి పత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లోని సంబంధిత కార్యాలయంలో వారిని కలిసి, రాజోళి మండలంలో కాలేజీ ఆవశ్యకతను తెలిపారు.

కోలా‘హలం’

- వారం రోజులుగా చెదురుమదురు వర్షాలు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- సాగులో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారుల సూచన



చిన్నంబావి శివారులో సాగుకు పొలం సిద్ధం చేస్తున్న రైతులు

చిన్నంబావి: ఎండలకు బీడు బారిన పొలాలకు తొలకరి చినుకులు ఊపిరి పోశాయి. వారం రోజులుగా మండలంలో చెదురుమదురు వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం బాట పట్టారు. ఎప్పుడూ రోహిణి కార్తెలో వర్షాలు బాగా కురిసే అవకాశం ఉన్నా.. ఈసారి ముందే వర్షాలు రావడంతో సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు పొలాలు పదునెక్కడంతో ఎద్దుల నాగళ్లు, ట్రాక్టర్లతో దుక్కులను దున్నుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఇలాగే కురిస్తే ముందే విత్తనాలు నాటుకునేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు. గతేడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన గురయ్యారు. ఈ క్రమంలో రెండో పంట వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. కానీ ఈ ఏడాది ముందే వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పంటల సాగు అంచనా..

మండలంలో 17గ్రామ పంచాయతీల పరిధిలో 27వేల ఎకరాల్లో పంట సాగు చేస్తారని అధికారుల లెక్కలు చెప్తున్నాయి. మొక్కజొన్న 9వేల ఎకరాలు, ఉల్లి 3వేల ఎకరాలు, వరి 7వేల ఎకరాలు, మిరప 600ఎకరాలు, కందులు 500ఎకరాలు, పత్తి 200ఎకరాల్లో సాగులోకి రానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

జూరాల చివరి ఆయకట్టులో అయోమయం

జూరాల ప్రాజెక్టు చివరి ఆయకట్టు మండలంలోని పొలాలే ఉండడంతో దాదాపుగా 12వేల ఎకరాల్లో సాగు గందరగోళం ఉంటుంది. ఈ వర్షాలకు విత్తనాలు విత్తుకున్నా.. ఆయకట్టుకు కాల్వల ద్వారా సాగునీరు ఎప్పుడు వస్తాయోనని ఆందోళనలో రైతులు ఉన్నారు. అదేవిధంగా చిన్నమారు లిఫ్టు కింద మరో 9వేల ఎకరాలు ఉండడం, లిఫ్టు మరమ్మతు నేటికీ పూర్తి కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ముందస్తు వర్షాలతో పాటు సకాలంలో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందితే ఈ సారి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సాగుకు సానుకూలం

ఎప్పుడు లేనంతంగా ఈ ఏడాది ఎండలు రావడం, అదే విధంగా ముందుగానే వర్షాలు వస్తుండటంతో పంటల సాగుకు సానుకూలంగా ఉండే అవకాశం ఉంది. దుక్కులు దున్నుకునే సమయంలో, విత్తనాల సేకరణలో రైతులు జాగ్రత్తలు వ్యవహరిస్తే ఈ ఏడాది పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా చూసుకోవాలని.

– డాకేశ్వర్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి

సిద్ధం చేస్తున్నాం..



గతేడాది వర్షాలు ఆలస్యం కావడంతో పంటల సాగు గతి తప్పింది. దీంతో రెండో పంటను చాల మంది రైతులు సాగు చేయలేదు. కానీ ఈ ఏడాది ముందే వర్షాలు వస్తుండటంతో రైతులు ఇప్పటికే విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. వరి, మొక్కజొన్న విత్తనాలను ఇప్పటికే రైతులకు అందుబాటులో ఉన్నాయి.

– సుధాకర్‌నాయుడు

రేపటి నుంచి వీరభద్రుడి ఉత్సవాలు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు వీరభద్ర స్వామి 10వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు గణపతి హోమం, స్వామివారికి దాసంగాల సమర్పణ, నవగ్రహ హోమం, అఖండ భజన కార్యక్రమాలు, ట్రాక్టర్ రివర్స్‌గేర్, భజన పోటీలు ఉంటాయన్నారు. రెండో రోజు రుద్రహోమం, బండలాగుడు పోటీలు, సుదర్శన హోమం, నందికోళ్ల సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి. మూడో రోజు కుంకుమార్చన, స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, భద్రకాళీ అమ్మవారికి వడి బియ్యం కార్యక్రమం, పూర్ణాహుతి కార్యక్రమం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్వామి వారి ఉత్సవాలకు దాతల సహకారంతో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. బండలాగుడు పోటీలో పాల్గొనే వారు పేర్ల నమోదుకు, పూర్తి సమాచారం కోసం 99496 01761, 81870 48094, 99125 77415, 99510 01042, 95057 08096, 97059 46996 నంబర్లను సంప్రదించాలన్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూల విరాట్

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

చిన్నంబావి: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వగ్రామం అయిన పెద్దదగడ, తను చదువుకున్న పెద్దమారు గ్రామాల్లోని పాఠశాలను దత్తత తీసుకుని విద్యాభివృద్ధికి కృషి చేస్తానని గతంలో చెప్పిన మాట ప్రకారం ఆయా పాఠశాలలను రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ కేతూరి ధర్మతేజ సందర్శించారు. ఈ సందర్భంగా పెద్దదగడలో అదనపు తరగతులు, పూర్తిగా డిజిటల్ ద్వారా విద్యాబోధన, నిత్యం అందుబాటులో ఉండే విధంగా స్టడీ హాల్ వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. అదేవిధంగా పెద్దమారులో సైతం మౌలిక వసతులు ఏర్పాటు ప్రత్యేకమైన దృష్టితో నియోజకవర్గంలోనే ఆదర్శపాఠశాలగా మార్చేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తను పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు మంత్రి ప్రత్యేకమైన దృష్టితో పెద్దదగడలో త్వరలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు. అందులో భాగంగా గ్రామంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులై ఉన్నత శిఖరాలకు అధిరోహించాలనే ఉద్దేశంతో కార్యచరణను రత్నగిరి ఫౌండేషన్‌కు అప్పజెప్పరన్నారు. తనపై నమ్మకం ఉంచినందుకు అన్ని హంగులతో పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని ఆయన చెప్పారు. తన దృష్టి వచ్చిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను, జగదీష్, యుగంధర్‌గౌడు, శంకర్ యాదవ్, వెంకటేష్, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దదగడలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ ధర్మతేజ

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెబ్బేరు రూరల్: కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు, కార్మికులతో కలిసి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావుకి 8 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేసే కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వేతనాల పేస్లిప్‌లు ఇవ్వాలని, పీఎఫ్ కటింగ్స్ సరిగా చేయడం లేదన్నారు. ప్రభుత్వం చెలించాల్సిన 12 శాతం వాటా కూడా కార్మికుల జీతం నుంచే కట్ చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న స్వీపర్లు, పేషెంట్ కేర్, ఎలక్ట్రిసిటీ, సెక్యూరిటీ గార్డులను తదితర కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి ప్రతినెల 1న వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి, జిల్లా కార్యదర్శి సాయిబాబ, నాయకులు నరేందర్, జలాల్, భరత్, కళావతమ్మ, రమేష్, రవి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరుపయోగంగా మీసేవ కేంద్రాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో ఉన్న మీసేవా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. జనవరి నెలలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ కేంద్రాలను ప్రారంభించారు. 4 నెలలు అయిన నేటికి మీసేవా కేంద్రాలు వినియోగంలోకి రాలేదు. ఒక్కొక్క మీసేవ కేంద్రానికి భవన నిర్మాణం కోసం రూ.10.50 లక్షలు, కంప్యూటర్ల కొనుగోలుకు రూ.2 లక్షలు వెచ్చించారు. ప్రతి మీసేవ కేంద్రానికి సరఫరా చేసిన అవసరం ఉన్న ఫర్నీచర్‌తోపాటు కంప్యూటర్‌లను ప్రస్తుతం గ్రామ పంచాయతీ సిబ్బంది వినియోగించుకుంటున్నారు. గ్రామాలలో ఉన్న మీసేవా కేంద్రాలకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇచ్చి కేంద్రాలను ప్రారంభించాలని విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శిరీష ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న శిరీష ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.జహంగీర్ పర్యవేక్షణలో రీసెర్చ్ చేశారు. ఏ స్టడీ ఆన్ క్రెడిట్ స్కీమ్స్ ఆఫర్డ్ బై కమర్షియల్ బ్యాంకు టూ మైక్రో అండ్ స్మాల్ ఎంట్రప్రెన్యూర్ విత్ రెస్పెక్ట్ టు ఏరెస్ట్ వైల్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఓయూ గౌరవ డాక్టరేట్ అందజేసింది. శిరీషకు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ తోపాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మారోజు వీరన్నకు ఘన నివాళి

వనపర్తి టౌన్: దళిత, తెలంగాణ ఉద్యమాలను మమేకం చేసిన విప్లవ వీరుడు మారోజు వీరన్న అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం మారోజు వీరన్న 49వ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. దేశంలో దళిత, బహుజన వర్గాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటూ ఉద్యమాలకు పునాది వేసిన వ్యక్తి మారోజు వీరన్న అని, కుల సంఘాలు ఏర్పాటు చేసి అస్తిత్వ పోరాటాలకు ఆజ్యం పోసిన వ్యక్తి మారోజు వీరన్న చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో కవి గిరి రాజాచారి, గంధం నాగరాజు, బాలస్వామి నాయుడు, గంధం పరంజ్యోతి, మండ్ల దేవన్న నాయుడు, జోహెబ్ హుస్సేన్, బాలేమియా, మహేష్, శ్రీనివాసులు నాయుడు, కుశకుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మారోజు వీరన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొనసాగుతున్న ఉపాధి పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పాటు కాల్వలలో పూడికతీత, చెరువు కుంటలలో ఒండ్రుమట్టి తరలింపు పనులు చేస్తున్నారు. వ్యవసాయ పొలాలకు ఒండ్రుమట్టి తరలించుకునేందుకు టాక్టర్లను ఏర్పాటు చేసుకుంటే కూలీల ద్వార ఒండ్రుమట్టిని నింపుతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. ప్రస్తుతం గొల్లవానికుంటలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని వివరించారు. రైతులంతా ఒండ్రుమట్టిని తీసుకెళ్లాలని ఆయన కోరారు.



గొల్లవాని కుంటలో ఒండ్రుమట్టి తీస్తున్న కూలీలు

రోడ్డుపై బోరును పూడ్చివేయండి

మానవపాడు: జల్లాపురంలో ఓ వ్యక్తి ప్రభుత్వానికి సంబంధించిన రోడ్డుపై బోర్ వేయించారని, జల్లాపురం గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, అధికారుల ఆదేశానుసారం గురువారం జల్లాపురం గ్రామం సందర్శించి రోడ్డుపై బోర్ వేసిన వ్యక్తికి నోటీస్‌లు అందించామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జల్లాపురంలోని వ్యక్తికి బోర్ పూడ్చివేయమని ఆదేశాలు ఇచ్చామన్నారు. స్పందించిన వ్యక్తి రోడ్డు స్థలం తమది కాదని, బోర్‌ను పూడ్చివేస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ధర్నా



ఎంసీహెచ్‌లో జెండా ఎగురవేస్తున్న కార్మికులు

పెబ్బేరు రూరల్: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు గురువారం బీఆర్ఎస్ మండల నాయకులు మండల కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ క్వింటాల్ వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ధర్నా కారణంగా చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారితో నిరసన విరమింపజేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరి పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు సన్నాలు పండించే వారికి మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం సరి కాదన్నారు. రైతులకు ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. రైతులందరికీ బోనస్ ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వర్షంతో వారాంతపు సంతలో ఇబ్బందులు

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం కురిసిన వర్షానికి వారాంతపు సంతలో సరుకులను విక్రయించేందుకు వచ్చిన వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కురగాయలు, ఆకు కూరలు, పండ్లు, అల్లం, వెల్లుల్లి వ్యాపారులు తమ సరుకులను అమ్ముకోనేందుకు గురువారం అమరచింతలో జరిగే వారాంతపు సంతకు వచ్చారు. మధ్యాహ్నం నాలుగున్నర గంటల నుంచి వర్షం కురుస్తుండటంతో కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, ఇతర వస్తువులు వర్షపు నీటిలో తడిసిపోవడంతో ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షపు జల్లులు కురుస్తుండడంతో ప్రజలు కూరగాయలు కొనేందుకు గొడుగుల సహాయంతో సంతకు వచ్చారు.



వర్షంలో కూరగాయలు కొంటున్న ప్రజలు

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

పాన్‌గల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీని నివారించొచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ నిల్వ నీటిని పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, మదన్, గోపాల్, మధుబాబు, నర్సమ్మ, నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం, డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నందకిషోర్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



గోపాల్‌పేటలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దమందడిలో..

పెద్దమందడి మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ అవగాహన ర్యాలీని డాక్టర్ వీణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డెంగీ నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓంకార్, ఆశా వర్కర్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రజలందరి సహకారం, భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమని డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం, డెంగీ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గోపాల్‌పేట: డెంగీని తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని డాక్టర్ కృష్ణకుమారి పిలుపునిచ్చారు. గురువారం జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు వరకు డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ క్లైవెన్‌మార్క్, సిద్ధగౌడ్, సుచిత్ర, కౌసల్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుధారాణి, ఝాన్సీరాణి, భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు సూర్యనారాయణ, స్వరూపరాణి, హెల్త్‌అసిస్టెంట్లు రాజశేఖర్, తిరుపతయ్య, ఏఎన్‌ఎంలు వెంకటమ్మ, శారద, జయశ్రీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో వైద్య సిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శబరి, లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్: డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని వైద్యులు శరత్‌కుమార్, వసంత, గీత, సురేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆత్మకూర్‌లో తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



పెబ్బేరులో..



ఆత్మకూర్‌లో..



పాన్‌గల్‌లో..



వీపనగండ్లలో..



పెద్దమందడిలో..



కొత్తకోటలో..



ఖిల్లాఘనపురంలో..